"అదా! ఇంటి దగ్గర చదువుకురాని వాళ్ళని శిక్షించాను. చదివిన వాళ్ళని మెచ్చుకున్నాను. అంతా వారి బాగుకే తప్ప నాకెలాంటి పక్షపాతం లేదు." చెప్పాడు ఉపాధ్యాయ మిత్రుడు.

"నిన్నటి నీ ప్రశ్నకి జవాబు కూడా ఇదే. భగవంతుడికి కూడా నీలా ఎవరి మీదా పక్షపాతం లేదు. కిందటి జన్మల్లో కొందరు చెడ్డ పనులు చేయబట్టి వాళ్ళకంటిన పాపం వదిలించడానికి అనారోగ్యం, దారిద్ర్యం లాంటివి ఇచ్చాడు. మంచి పనులు చేసిన వారికి పుణ్యఫలంగా ఐశ్వర్యం, ఆరోగ్యం ఇచ్చాడు. ఎవరి కర్మకి వాళ్ళే బాధ్యులు"

## 31. గురు పాదాల విలువ

భారతదేశం నించి అమెరికాకి వచ్చిన ఓ స్వామీజీకి, ఓ నది ఒడ్డున గల ఆశ్రమానికి, హిందూ మతంపై ఆసక్తి గల ఓ అమెరికన్ వెళ్ళి, వాళ్ళ లైబ్రరీ నించి హిందూ మతం గురించిన ఎన్నో పుస్తకాలు తీసుకెళ్ళి చదివాడు.

ఆ పుస్తకాలని తిరిగి ఇచ్చేసాక స్వామీజీతో చెప్పాడు.

"హిందూ మతంలో నాకంతా నచ్చింది, ఒక్కటి తప్ప."

"ఏమిటది? అందులో నీకేం లోపం కనబడింది?" అడిగాడాయన.

"పాద నమస్కారాలు. శిష్యులు గురువుగారి పాదాలనాశ్రయించడం. పాదాలు శరీరంలో అధమస్థానంలో ఉంటాయి. మనం బాత్‌రూంలోకి వెళ్ళినప్పుడు తప్పనిసరిగా పాదాలు కడుగుతాం. శరీరంలో బురద, మురికి, మట్టి లాంటివి అధికంగా అంటేది పాదాలకే. అలాంటి పాదాలకి ఓ పవిత్ర స్థానం ఇవ్వడం నాకు నచ్చలేదు. గురువు శరీరంలోని ఏదో ఓ అవయవం మీద గౌరవాన్ని ప్రదర్శించాలనుకున్నప్పుడు, అది ఉన్నత స్థాయిలోని శిరస్సు పట్ల ప్రదర్శిస్తే బావుండేదనిపిస్తోంది. గురువు కాలి బొటనవేళ్ళ నించి గంగా యమునలు ప్రవహిస్తుంటాయని, ఆ నీటిని శిష్యుడు తల మీద చల్లుకుంటే

పవిత్రమౌతాడని చదివాను. కానీ అదంతా ఊహతో కూడిన కల్పన తప్ప అందులో నిజం ఎక్కడుంది?'' అడిగాడా అమెరికన్ సీరియస్‌గా.

స్వామీజీ చిన్నగా నవ్వి లేచి చెప్పాడా అమెరికన్‌తో.

''అలా నదివద్దకి వెళ్ళి మాట్లాడుకుందాం పద.''

ఇద్దరూ నది ఒడ్డుకి వెళ్ళారు. అక్కడ కొందరు జాలర్లు నదిలో చేపలు పడుతున్నారు. నీళ్ళల్లో నిలబడి వలని దూరంగా విసురుతున్నారు. వలలో చేపలు పడ్డాక, వాటిని పట్టుకుని బుట్టలో వేసుకుని మళ్ళీ వలని దూరంగా విసురుతున్నారు.

''జాలర్ల వలలో ఏ చేపలు పడుతున్నాయి? వారి పాదాల వద్ద ఉన్నవా? లేక దూరంగా వున్న చేపలా?'' ప్రశ్నించాడు స్వామీజీ.

''దూరంగా ఉన్నవే.'' చెప్పాడు అమెరికన్ వినమ్రంగా.

''భగవంతుడు ఆ జాలరి వంటివాడు. అతని చేతిలోని వల మాయ. దేవుడు విసిరే వలలో గురు పాదాలను ఆశ్రయించిన చేపలు అనే శిష్యులైన భక్తులు మాయకి చిక్కరు. దాంతో మోక్షాన్ని పొందుతారు. గురు పాదాలను ఆశ్రయించకుండా, వాటికి దూరంగా వుండే జీవులు మాయలో చిక్కుకుని జనన మరణ చక్రంలో పడి కొట్టుకుంటూంటారు.'' స్వామీజీ చెప్పాడు.

గురువు పాదాలను శిష్యులు ఆశ్రయించడంలోని మర్మం ఆ అమెరికన్‌కి అప్పుడు చక్కగా అర్థమైంది.

## 32. మన మంచికే

చిన్నతనం నించి దైవభక్తికి అలవాటుపడిన ఓ వ్యక్తి తన సంసార జీవనంలో వచ్చే చిక్కులు తొలగించమని, తనకి కావలసింది ఇవ్వమని తరచు దేవుణ్ని ప్రార్థించసాగాడు. ఐతే అతని కోరికలలో కొన్ని తీరేవి. కొన్ని చిన్నవైనా తీరేవి కావు. 'దేవుడు ఎందుకిలా చేస్తున్నాడు?' అన్న ఆలోచన